నిరసనలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

ఎమ్మెల్సీ మల్లన్న వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాలను జనగామ జిల్లాలో కలుపుతామని పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సిపిఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఆయన వ్యాఖ్యలపై సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. చేర్యాల ప్రాంత ద్రోహి మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఇచ్చిన సలహా మేరకు ఎమ్మెల్సీ మాట్లాడిన మాటలను వెంటనే వెనక్కి తీసుకోవాలని అన్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూలిమిట్ట మండలాల ప్రజలు ఎనిమిదేళ్లుగా సిద్దిపేట జిల్లాలోనే కొనసాగుతున్నారని, తిరిగి ఈ మండలాలను జనగామ జిల్లాలో కలుపుతామనడం ఇక్కడి ప్రజల మనోభావాలను దెబ్బతీయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. చేర్యాలను రెవిన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించి, నియోజకవర్గ కేంద్రంగా పునరుద్ధరించాలని చేర్యాల ప్రాంత ప్రజలు పోరాడుతుంటే కనిపంచడం లేదా అని ప్రశ్నించారు. ప్రజల మనోభావాలకు భిన్నంగా వ్యవహరిస్తే సిపిఎం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్లబండి శశిధర్, కొమురవెల్లి, చేర్యాల, మద్దూరు మండలాల కార్యదర్శులు శెట్టిపల్లి సత్తిరెడ్డి, కొంగరి వెంకట మావో, ఆలేటి యాదగిరి, దూల్మిట్ట మండల బాధ్యులు చొప్పరి రవికుమార్, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్లబండి నాగరాజు, జిల్లా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు క్షమాపణ చెప్పాలి

- స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు సరికాదు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ సర్వీస్ ఉద్యోగాల్లో వికలాంగుల కోటాపై స్మితా సబర్వాల్ చేసిన అనుచిత వ్యాఖ్యలను సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. ప్రతిభ అనేది ఎవరి సొత్తుకాదనీ, వైకల్యాలు, శక్తి సామర్థ్యాలు మేధోశక్తిపై ప్రభావం చూపబోవని స్పష్టం చేసింది. స్మితా సబర్వాల్ ఓ ఐఎఎస్ అధికారిగా వికలాంగులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఆమె తన స్థాయిని దిగజారుస్తోందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. బ్రెయిలీ లిపిని అందించిన లూయిస్ బ్రెయిలీ మొదలుకుని, అనేక మంది సివిల్ సర్వెంట్లు, రాజకీయవేత్తలు, డాక్టర్లు వారి వారి రంగాల్లో తమ శక్తి సామర్థ్యాలను చాటుతూ ఉన్నతస్థాయి సేవలందిస్తున్న వాస్తవం మన కళ్లముందు ఉందికదా వికలాంగుల మనోభావాలను దెబ్బతినేలా చేసిన ఈ వ్యాఖ్యలను వెంటనే ఆమె వెనక్కు తీసుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వెంటనే పూర్తి సమాచారమివ్వాలి

- క్యాబినెట్ సబ్ కమిటీ భేటీలో మంత్రి దామోదర

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వివిధ శాఖలకు చెందిన పూర్తి సమాచారాన్ని వెంటనే సమర్పించాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో మంత్రి అధ్యక్షతన 317 జిఒపై క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో తొమ్మిది ప్రభుత్వ శాఖలపై చర్చించారు. పలు అంశాలపై అధ్యయనం చేశారు. పాత జిల్లాల వారీగా ఉద్యోగుల సర్వీస్, పదోన్నతుల అంశాలను పరిగణనలోకి తీసుకుని 317 జీవోను పరిష్కరించాలని క్యాబినెట్ సబ్ కమిటీ నిర్ణయించింది. సమావేశంలో కమిటీ సభ్యులు, రాష్ట్ర మంత్రులు శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కవిత పిటిషన్లపై విచారణ వాయిదా

హైదరాబాద్ బ్యూరో : ఢిల్లీ మద్యం విధానం, సిబిఐ కేసులో డీఫాల్ట్ బెయిల్ ఇవ్వాలని కోరుతూ బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వేసిన పిటిషన్‌పై సోమవారం రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరిగింది. కవితపై సిబిఐ వేసిన ఛార్జిషీట్‌ను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. జులై 26న కవితను వర్చువల్‌గా కోర్టులో హాజరుపర్చాలని సిబిఐని కోర్టు ఆదేశించింది. ఛార్జిషీట్ కాపీలను నిందితుల తరపు లాయర్లకు ఇవ్వాలని సూచించింది. తదుపరి విచారణను న్యాయస్థానం ఆగస్టు 5కి వాయిదా వేసింది. కవిత సహా మరో నలుగురి పాత్రపై జూన్ 7న సిబిఐ ఛార్జిషీట్ దాఖలు సంగతి తెలిసిందే.

త్వరలోనే రెండో విడత రుణమాఫీ

హైదరాబాద్ బ్యూరో : రెండో విడత పంట రుణమాఫీని సాధ్యమైనంత త్వరగా అమలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. రూ.లక్ష లోపు రుణాలకు మొదటి విడతగా 11.50 లక్షల కుటుంబాలకు రూ.6,098.94 కోట్లు విడుదల చేశామన్నారు. వీటిలో రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) నుంచి అందిన సమాచారం మేరకు 11.32 లక్షల కుటుంబాలకు రూ.6,014 కోట్లు జమ అయ్యాయనీ, కొన్ని సాంకేతిక కారణాలతో 17,877 ఖాతాలకు చెందిన రూ.84.94 కోట్లు రైతుల అకౌంట్లలో జమ కాలేదని వివరించారు. .

నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు

- వాడివేడిగా కొనసాగనున్న సభ
- ప్రభుత్వంపై బిఆర్ఎస్, బిజెపి విపక్షాస్త్రాలు
- దీటుగా బదులిచ్చేందుకు రేవంత్ సర్కార్ రె'ఢీ'

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐదు నెలల విరామానంతరం రాష్ట్ర శాసనసభ మంగళవారం కొలువుదీరనుంది. ఫిబ్రవరిలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ప్రభుత్వం... ప్రస్తుత సమావేశాల్లో పూర్తి స్థాయి పద్దును సభకు సమర్పించనుంది. కొద్ది నెలల కిందట రోడ్డు ప్రమాదంలో మరణించిన సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందితకు సంతాపం ప్రకటించిన అనంతరం తొలిరోజు సభ వాయిదా పడనుంది. ఈ క్రమంలో మంగళవారం ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న సభ కార్యకలాపాలు కేవలం అరగంటపాటే కొనసాగే అవకాశాలున్నాయి. ఆ తర్వాత స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన సభా వ్యవహారాల సంఘం (బిఎసి) సమావేశమై సమావేశాలను ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై చర్చించి, నిర్ణయం తీసుకోనుంది.

పార్టీ ఫిరాయింపులు, నిరుద్యోగుల ఆందోళనలు, ఇతరత్రా ప్రజా సమస్యల నేపథ్యంలో ఈసారి అసెంబ్లీ వాడివేడిగా కొనసాగనుంది. బిఆర్ఎస్‌కు చెందిన పది మంది ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో ఆ పార్టీ గరంగరంగా ఉంది. ఇదే విషయమై ఇప్పటికే స్పీకర్‌కు ప్రధాన ప్రతిపక్షం ఫిర్యాదు చేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలపై కచ్చితంగా చర్యలు తీసుకోవాలంటూ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు పదేపదే డిమాండ్ చేస్తున్నారు. ఈ వివాదంపై బిఆర్ఎస్ న్యాయస్థానాన్ని

కూడా ఆశ్రయించిన సంగతి తెలిసిందే. మరోవైపు గత సమావేశాల వరకూ బిజెపికి శాసనసభాపక్ష నేతను ఎన్నుకోలేదు. ఇప్పుడు ఆ పార్టీ ఎల్పీ నేతగా ఏలేటి మహేశ్వరరెడ్డిని నియమించింది. అందువల్ల బీజేపీకి చెందిన ఎనిమిది మంది ఎమ్మెల్యేలు కూడా ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించేందుకు సిద్ధమయ్యారు. బిఆర్ఎస్, బిజెపిలకు ధీటుగా బదులిచ్చేందుకు అధికార పక్షం సైతం రెడీ అయ్యింది. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవటం, విద్యుత్ కొనుగోళ్లలో అవకతవకలు, పింఛన్లలో అక్రమాలు, లోపభూయిష్ట విధానాలు తదితరాంశాలపై ప్రధాన ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టేందుకు వీలుగా సీఎం రేవంత్ అస్త్రశస్త్రాలు సిద్ధం చేశారు. ఇటీవల తొలి విడత రైతు రుణమాఫీ చేసిన నేపథ్యంలో ఆ అంశాన్ని ఏకరువు పెడుతూ ప్రభుత్వం బీఆర్ఎస్, బీజేపీలపై ఎదురుదాడికి దిగనుంది.

రేపటి నుంచి మండలి

శాసనసభ సమావేశాలు మంగళవారం నుంచి ప్రారంభం కానుండగా, శాసన మండలి మాత్రం ఒకరోజు ఆలస్యంగా బుధవారం కొలువుదీరనుంది. ఇటీవల మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు నిర్ణయించారు. ఆ ప్రకారం గవర్నర్ సిపి రాధాకృష్ణన్ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈసారి ఉభయ సభల సంయుక్త సమావేశం, గవర్నర్ ప్రసంగం లేకుండానే బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానుండటం గమనార్హం.

రూ.8 కోట్లతో పెద్దవాగు ప్రాజెక్ట్ మరమ్మతులు

- నష్టపోయిన నిర్వాసితులను ఆదుకుంటాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెద్దవాగు ప్రాజెక్టు నిర్వాసితులను ఆదుకుంటామని రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఈ నెల 18న వరద ఉప్పొంగి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం గుమ్మడిపల్లి గ్రామం వద్ద ఉన్న పెద్దవాగు ప్రాజెక్టుకు గండి పడి కట్ట తెగిన ప్రాంతాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పి రోహిత్ రాజ్, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి సోమవారం పొంగులేటి పరిశీలించారు. ధ్వంసమైన ప్రాజెక్ట్ ప్రదేశంలో కలియ తిరుగుతూ.. స్థానిక అధికారులనడిగి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం కోయ రంగాపురం, గుమ్మడిపల్లి, కొత్తూరుల్లో 51 మంది వరద ముంపు నిర్వాసితుల ఇండ్లకు మంత్రి స్వయంగా వెళ్లి పిఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. కొత్తూరు గ్రామంలో విద్యుత్ ప్రమాదంలో మరణించిన చాపర్ల మురళీ కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయా ప్రాంతాల్లో నిర్వాసితులను ఓదార్చారు. రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా కోయ రంగాపురం గ్రామంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ప్రాజెక్ట్‌కు ఇంతటి గండిపడటం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టు పరిధిలో నష్టం జరిగిన ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఆదుకుంటుందని అన్నారు. 400 ఎకరాల్లో ఇసుక మేట వేసి మొత్తం పూడుకుపోయినట్టు తమ దృష్టికి వచ్చిందని, ఇసుక తొలగింపు కోసం ఎకరాకు రూ.పది వేల చొప్పున ఇవ్వనున్నట్టు తెలిపారు. పత్తి, వరి పంటలు నష్టపోయిన రైతులకు విత్తనాలు ఉచితంగా అందజేస్తామన్నారు. వరదలో కొట్టుకుపోయిన ఒక్కో గొర్రె యజమానికి రూ.మూడు వేలు, ఆవులు, గేదెల యజమానికి

ఎద్దవాగును పరిశీలిస్తున్న మంత్రి పొంగులేట

రూ. 20 వేలు ప్రభుత్వం ఇవ్వనుందని తెలిపారు. వరద వల్ల నీట మునిగి ఇళ్లను కోల్పోయిన వారందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరు చేస్తామని ప్రకటించారు.

ప్రాజెక్టు తక్షణ మరమ్మతుల కోసం రూ.8 కోట్లు

ప్రాజెక్టుకు గండిపడిన చోట తక్షణ మరమ్మతుల కోసం సోమవారం ఉదయం ముఖ్యమంత్రితో మాట్లాడి రూ.8 కోట్లు మంజూరు చేయించినట్టు మంత్రి తెలిపారు. ప్రాజెక్టు మూడు గేట్లతో 40 వేల క్యూసెక్కుల వరదనీరు విడుదల అవుతుందని, 70 వేల క్యూసెక్కుల నీరు వచ్చినప్పుడు అధికారుల నిర్లక్ష్యంతోనే ప్రాజెక్ట్‌కు గండి పడిందని చెప్పారు. సరైన సమయానికి గేట్లు ఎత్తి ఉంటే ఇంతటి ముప్పు జరిగేది కాదని ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులైన అధికారులకు ఇప్పటికే షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. కాగా, పెద్దవాగు ప్రాజెక్ట్ భూములను కొందరు కబ్జా చేశారని స్థానిక రైతులు మంత్రికి తెలపడంతో.. ఆయన స్పందించి.. వర్షాలు తగ్గాక పూర్తిస్థాయిలో సర్వే చేయించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. 41 మంది రైతు కూలీలను రక్షించేందుకు వెంటనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడామని, హెలికాప్టర్ సహాయంతో వారిని కాపాడారని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ సందర్భంగా ఎపి సర్కారుకు తెలంగాణ ప్రభుత్వం తరపున కృతజ్ఞతలు తెలిపారు.

ముంపు ప్రాంత ప్రజలు అధైర్య పడొద్దు

గోదావరి వరదల వల్ల ప్రజలెవ్వరూ అధైర్య పడొద్దని, రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. సోమవారం సాయంత్రం భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలంలోని గొమ్మూరు గోదావరి రేవు ప్రాంతంలో వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. గోదావరి వరదలను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో గోదావరి వరద సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలందరినీ అప్రమత్తం చేయాలన్నారు. మంత్రి వెంట.. ఇరిగేషన్ సీఈ ఎ శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం ఆర్డీవో మధు, వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, ఉద్యానవన శాఖ అధికారి సూర్యనారాయణ, ఆర్అండ్‌బి ఎఇ శ్రీనివాసరావు, పంచాయతీ రాజ్ ఇఇ శ్రీనివాసరావు, ఎన్‌పిడిసిఎల్ ఎస్‌సి బీకం సింగ్, అశ్వారావుపేట తహసీల్దార్ క్రిష్ణ ప్రసాద్, పాల్వంచ డిఎస్‌పి సతీష్ కుమార్, నాయకులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన న్యాయ చట్టాలపై వైఖరి వెల్లడించండి

- రాష్ట్ర ప్రభుత్వానికి కెటిఆర్ బహిరంగ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నూతన న్యాయ చట్టాలపై రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించాలని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రేవంత్ సర్కార్‌కు సోమవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. కొత్త న్యాయ చట్టాలపై వివిధ వర్గాల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో వీటి అమలుపై విస్తృతంగా చర్చ జరగాల్సిన అవసరముందని ఆయన పేర్కొన్నారు. ఈ చట్టాల్లోని పలు నిబంధనలు, సెక్షన్లు ప్రజల ప్రాథమిక హక్కులతోపాటు వ్యక్తిగత స్వేచ్ఛను హరించేలా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని యధాతధంగా అమలు చేస్తే రాష్ట్రంలో పోలీస్ రాజ్యం వచ్చే ప్రమాదముందని కెటిఆర్ హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కర్నాటక సీఎంలు ఈ చట్టాల అమలును వ్యతిరేకిస్తూ సవరణలు తీసుకొచ్చారని గుర్తు చేశారు. జాతీయస్థాయిలో కాంగ్రెస్ ఈ చట్టాలపై తన వ్యతిరేకతను ఇప్పటికే తెలియజేసినా, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటిదాకా ఒక్క మాట కూడా మాట్లాడలేదని పేర్కొన్నారు. ప్రజా ఉద్యమాలకు చిరునామాగా ఉన్న తెలంగాణ గడ్డపై నిరంకుశ నూతన క్రిమినల్ చట్టాలపై రేవంత్ సర్కారు వెంటనే తన నిర్ణయాన్ని ప్రకటించాలిన డిమాండ్ చేశారు. ఈ చట్టాలను సవరించాలని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడంతో పాటు, వాటిని వ్యతిరేకిస్తూ అసెంబ్లీ సమావేశాల్లో తీర్మానం చేయాలని సూచించారు.

COURT NOTICE

మహారాజశ్రీ మంగళగిరి సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)వారి కోర్టులో

I.A.No:804 / 2019 & I.A.No: 805 / 2019, I.A.No:5/2020 & I.A.No:6/2020 in O.S.No: 156/2016

బిట్వీన్:
దుగ్గింపూడి సావిత్రి, ...పిటీషనరు/వాది
మరియు
దేవరపల్లి సామ్రాజ్యం మరియు వగైరాలు ...రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

టు,
R-12/D-12:అట్ల రత్నమాల,భర్త.సాంబి రెడ్డి, చింతల, హైదరాబాద్, తెలంగాణ.
R-14/D-14:కల్లం శ్రీనివాస రెడ్డి,తండ్రి.బుచ్చి రెడ్డి, చింతల, హైదరాబాద్, తెలంగాణ.

పై నెంబరు దావాలోని పిటీషన్లులో రెస్పాండెంట్లు అయిన మీకు శ్రీ కోర్టు వారి ద్వారా నోటీసులు/సమన్లు పంపించినను మీరు తీసుకోనక కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు మీకు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా పేపరులో ప్రకటన ద్వారా తెలియపరచమని ఆర్డరువేయగా, సదరు ఆర్డరు ప్రకారము మీరు **ది:09-08-2024**న ఉ.గం.**10-30**ని.లకు పైతెలిపిన కోర్టునకు మీరు స్వయంగా కాని, మీ అడ్వకేటు ద్వారా గాని హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలయును. లేనియెడల మీ పరోక్షమందు విచారించి తీర్మానించబడునని తెలియపర్చడమైనది. (శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:09-08-2024.

శ్రీమతి యం. చారులత,
పిటీషనరు/వాది తరపు అడ్వకేట్,7/1 అరండల్ పేట,గుంటూరు.

మహారాజశ్రీ తెనాలి XIth అడిషనల్ డిస్ట్రిక్ట్ సివిల్‌జడ్జి వారి కోర్టు
F.C.O.P. No. 872/2023

బిట్వీన్ :
Aravinda Kumar Kailasapu,
S/o Upendra Rao, Khammam.... పిటీషనర్
And
Asisha Chunduru, D/o Anjaneya Guru Prasad, W/o Aravinda Kumar Kailasapu, Tenali .... రెస్పాండెంట్

To,
Petitioner : Aravinda Kumar Kailasapu S/o Upendra Rao, H.No. 3-8-319/1, Guttala Bazar, Khammam Post & District, T.S.

పై నెంబరు పిటీషన్‌లో మీరు పిటీషనరు అయివున్నారు. సదరు పిటీషన్ Khammam Family court నుండి శ్రీ కోర్టునకు ట్రాన్స్‌ఫర్ అయినందున మీ హాజరు నిమిత్తం ది.13-8-2024 తేదీకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా : 13-8-2024

ఎం.శ్రీనివాసరావు,
రెస్పాండెంట్ తరపు అడ్వకేట్,
తెనాలి. సెల్ : 93940 70366

మహారాజశ్రీ తెనాలి XIth అడిషనల్ డిస్ట్రిక్ట్ సివిల్‌జడ్జి వారి కోర్టు
F.C.G.W.O.P. No. 873/2023

బిట్వీన్ :
Aravinda Kumar Kailasapu,
S/o Upendra Rao, Khammam.... పిటీషనర్
And
Asisha Chunduru, D/o Anjaneya Guru Prasad, W/o Aravinda Kumar Kailasapu, Tenali .... రెస్పాండెంట్

To,
Petitioner : Aravinda Kumar Kailasapu S/o Upendra Rao, H.No. 3-8-319/1, Guttala Bazar, Khammam Post & District, T.S.

పై నెంబరు పిటీషన్‌లో మీరు పిటీషనరు అయివున్నారు. సదరు పిటీషన్ Khammam Family court నుండి శ్రీ కోర్టునకు ట్రాన్స్‌ఫర్ అయినందున మీ హాజరు నిమిత్తం ది.13-8-2024 తేదీకి వాయిదా వేసి యున్నారు. సదరు వాయిదారోజు ఉదయం 10-30 గం.లకు మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది ద్వారా గానీ శ్రీ కోర్టువారి యెదుట హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొన వలెను. లేనియెడల సదరు పిటీషన్‌ను మీ పరోక్షమున విచారించి తీర్మానించబడును.
(శ్రీ కోర్టువారి ఉత్తర్వులతో)

వాయిదా : 13-8-2024

ఎం.శ్రీనివాసరావు,
రెస్పాండెంట్ తరపు అడ్వకేట్,
తెనాలి. సెల్ : 93940 70366


రిలే నిరాహార దీక్ష చేస్తున్న వస్త్ర పరిశ్రమ జెఎసి నాయకులు

మగ్గంతోనే నేతన్నల బతుకులు

- వస్త్ర సంక్షోభాన్ని నివారించి ఉపాధి కల్పించాలి
- పవర్‌లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్
- ప్రభుత్వం స్పందించే వరకు పోరాడతాం
- వస్త్ర పరిశ్రమ జెఎసి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మగ్గంతోనే నేతన్న బతుకులు ముడిపడి ఉన్నాయని, అలాంటి వస్త్ర పరిశ్రమలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి కార్మికులకు ఉపాధి కల్పించాలని తెలంగాణ పవర్ లూమ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ అన్నారు. సిరిసిల్ల పట్టణంలోని స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద సిరిసిల్ల పవర్‌లూమ్ వస్త్ర పరిశ్రమ అనుబంధ రంగాల జెఎసి ఆధ్వర్యంలో సోమవారం రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏడు నెలల నుంచి వస్త్ర పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోయి, ఉపాధి లేక ఇప్పటికే 10 మంది నేత కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాంచెల బంద్‌తో వేలాది మంది కార్మికులు, ఆ సాములు రోడ్డున పడ్డారన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. 20 రోజుల కింద నేతన్న పోరు యాత్రకు పిలుపునిస్తే సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం చెప్పడంతో తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. కానీ ఇప్పటివరకు ఎలాంటి స్పందనా లేదని, నేత కార్మికుల పట్ల ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అన్నారు.

సిఎం రేవంత్ రెడ్డి వస్త్ర పరిశ్రమ సంక్షోభంపై సమీక్ష నిర్వహిస్తామని వాయిదాలు వేస్తూ వస్తున్నారన్నారు. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా నేత కార్మికుల జీవితాలతో ఆటలాడుకోవద్దన్నారు. నేతన్నల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రిలే నిరాహార దీక్ష చేపట్టినట్టు చెప్పారు. వస్త్ర పరిశ్రమకు బిజెపి చేసిందేమీ లేదని, పైగా జీఎస్టీ పెంచి భారం మోపిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వస్త్ర పరిశ్రమను రక్షించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. వస్త్ర పరిశ్రమకు విద్యుత్ సబ్సిడీ, వర్కర్స్ టు ఓనర్, యారన్ సబ్సిడీ, త్రిఫ్ట్, యారన్ సబ్సిడీ అందించి.. జనతా వస్త్ర పథకం తదితర పథకాలను అమలు చేయాలన్నారు. సిరిసిల్ల గతంలో మాదిరిగా ఉరిసిల్ల కాక ముందే అసెంబ్లీ సమావేశాల్లో నేతన్నల సమస్యలపై చర్చించి పరిష్కార మార్గం చూపాలన్నారు. ప్రభుత్వం స్పందించకుంటే అసెంబ్లీ ముట్టడి చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చేనేత వస్త్ర వ్యాపార సంఘం అధ్యక్షుడు తాటిపాముల దామోదర్, పాలిస్టర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆడెపు భాస్కర్, కాటన్ వస్త్ర ఉత్పత్తిదారుల సంఘం అధ్యక్షుడు కట్టే కొల లక్ష్మీనారాయణ, ఆసాముల సంఘం అధ్యక్షుడు సిరిసిల్ల రవీందర్, వైపని వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కుమ్మరి కుంట కిషన్, యారన్ అసోసియేషన్ అధ్యక్షుడు పిస్కా మధు, డయింగ్ ఓనర్స్ అసోసియేషన్ కార్యదర్శి కోడం శ్రీనివాస్, మ్యాక్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంగుల శ్రీనివాస్, అన్నల దాస్ శ్రీనివాస్, బొడ్డు శ్రీధర్, శ్రీగాద విష్ణు, మండల బాలరాజు, శ్రీరాం సత్యం, మండల రాజు, గాజుల లింగం, సిఐటియు నాయకులు మూశం రమేష్, కోడం రమణ పాల్గొన్నారు

పోడు రైతుల సమస్యలపై శాసనసభలో చర్చించాలి

- ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట పోడు రైతుల ఆందోళన
- పోడు భూముల సాధన కమిటీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పోడు రైతుల సమస్యలపై శాసనసభలో చర్చించాలని పోడు భూముల సాధన కమిటీ కన్వీనర్ నన్నేసాబ్ డిమాండ్ చేశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా బోధన్ పట్టణంలోని ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట పోడు రైతులు ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్‌డిఒ అంబదాస్ రాజేశ్వర్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నన్నేసాబ్ మాట్లాడుతూ.. చందూర్ మండలంలోని గ్రామాల్లో గిరిజనేతర నిరుపేద రైతులు 30 సంవత్సరాలుగా పోడు భూమిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నారని అన్నారు. అర్హులైన ఈ నిరుపేద పోడు రైతులకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం గిరిజనులకు పట్టాలిచ్చి, గిరిజనేతరులకు మొండి చేయి చూపిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. శాసనసభ ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారని, దాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. శాసనసభ సమావేశాల్లో ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి పోడు రైతుల సమస్యలపై గళమెత్తాలని కోరారు. ప్రభుత్వం పోడు రైతులకు పట్టాలు ఇవ్వకపోతే పోడు రైతుల పోరాటాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

రేపు లాసెట్ కౌన్సెలింగ్ నోటిఫికేషన్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించిన లాసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్ ప్రక్రియకు సంబంధించిన నోటిఫికేషన్ బుధవారం విడుదల కానుంది. సోమవారం హైదరాబాద్‌లో లాసెట్ ప్రవేశాల కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్, లాసెట్ ప్రవేశాల కన్వీనర్ పి రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కన్వీనర్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. వచ్చేనెల ఐదు నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్‌తోపాటు ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని తెలిపారు. అదేనెల ఏడు నుంచి పదో తేదీ వరకు ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల (సిఎపి, ఎన్‌సిసి)కు భౌతికంగా హైదరాబాద్‌లో ధ్రువపత్రాల పరిశీలన జరుగుతుందని వివరించారు. వచ్చేనెల 21న అర్హులైన అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తామనీ, ఏమైనా అభ్యంతరాలుంటే ఈమెయిల్ ద్వారా పంపించాలని సూచించారు. అభ్యర్థులు ఇతర వివరాల కోసం www.:// lawcetadm.tsche.ac.in వెబ్‌సైట్‌ను బుధవారం నుంచి సంప్రదించాలని కోరారు.

Transworld Furtichem Pvt. Ltd.

NOTICE

In order to make the Indian farming community internationally competitive, TRANSWORLD FURTICHEM PRIVATE LTD., brings the following 100% Water Soluble Mixture Fertilizers as per the Order dated 24.10.2015 issued by the Ministry of Agriculture & Farmers Welfare, Govt. of India, New Delhi

S.No.	Name of the Fertilizer	Type of Fertilizer
1	NPK 12.7.25 (+8CaO) (2Mgo) + TE	100% Water Soluble Mixture Fertilizers
2	NPK 6.20.30 (+1,4MgO) + TE	100% Water Soluble Mixture Fertilizers
3	NPK 5-12-38+TE	100% Water Soluble Mixture Fertilizers
4	NPK 15-15-30-02 TE	100% Water Soluble Mixture Fertilizers
5	NPK 16-08-32-02 TE	100% Water Soluble Mixture Fertilizers
6	NPK 00-09-46-15 TE	100% Water Soluble Mixture Fertilizers
7	NPK 11-44-11-02 TE	100% Water Soluble Mixture Fertilizers
8	NPK 5-55-17 TE	100% Water Soluble Mixture Fertilizers
9	NPK 06-45-06+5S+5Mgo+TE	100% Water Soluble Mixture Fertilizers

Salient features: 1. 100% Water Soluble, **2.** Improves the quality and yield of the produce, **3.** Suitable to use through Drip irrigation and foliar application (Packing : Available in 1 Kg, 5 Kg, 10 Kg, & 25 Kg.)

Transworld Furtichem Pvt. Ltd. Plot No : 129, Auto Nagar, Hayathnagar, Rangareddy District, Telangana-500070

పర్యాటక శాఖ హోటళ్లు, రిసార్టుల ప్రయివేటీకరణను ఆపాలి

- కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ పర్యాటక శాఖ సంస్థకు చెందిన హరిత హోటళ్ళు, రిసార్టులను ప్రయివేటీకరణ చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు జె వెంకటేశ్, ఉపాధ్యక్షులు పద్మశ్రీ, ప్రధాన కార్యదర్శి జె కృష్ణారెడ్డి, కార్యదర్శి జె కుమారస్వామి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కోట్ల రూపాయల ఆదాయాన్ని సమకూర్చుతూ అభివృద్ధి చెందుతున్న వాటిని ప్రయివేట్ వ్యక్తులకు అప్పగించేందుకు పర్యాటక సంస్థ అధికారులు కసరత్తు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే కడెం రిసార్టు, హైదరాబాద్‌లోని తామతి-బారాదరి, నిజామాబాద్ అనంతగిరి హిల్స్ ఈ జాబితాలో ఉన్నాయని తెలిపారు. తెలంగాణ టూరిజం ప్రపంచవ్యాప్తంగా పేరు, ప్రఖ్యాతలు సంపాదిస్తున్నదనీ, ఈ హోటళ్లకు,రిసార్టులకు కోట్ల రూపాయల విలువ చేసే భూములు, భవనాలు ఉన్నాయని పేర్కొన్నారు. వీటిల్లో పర్మినెంట్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బంది 20 ఏండ్లకు పైగా సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. ఎనిమిది నెలల క్రితం ప్రజా పాలన అందిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటీకరించటమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం టూరిజానికి చెందిన హోటళ్లు, రిసార్టులను ప్రయివేటీకరించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

317 జిఒ సమస్యలను పరిష్కరించాలి

- మంత్రివర్గ ఉపసంఘం సభ్యులకు పిఆర్టీయుటిఎస్ వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో 317 జిఒ బాధిత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని పిఆర్‌టియుటిఎస్ ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు దామోదర రాజనర్సింహ, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ను సోమవారం హైదరాబాద్‌లో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు, ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. నూతన జిల్లాల ఏర్పాటులో భాగంగా ఉద్యోగ, ఉపాధ్యాయులను శాశ్వత ప్రాతిపదికన కేటాయింపులు చేసేందుకు గత ప్రభుత్వం విడుదల చేసిన 317 జీవో అమలు వల్ల ఏర్పడిన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వేర్వేరు జిల్లాల్లో పనిచేస్తున్న భార్యాభర్తలను ఒకే జిల్లాకు కేటాయించాలని కోరారు. స్థానికత ఆధారంగా ఉపాధ్యాయులను వారి సొంత జిల్లాకు బదిలీ చేయాలనీ, సీనియార్టీకి రక్షణ కల్పిస్తూ పరస్పర బదిలీలను అమలు చేయాలని సూచించారు. వివిధ జిల్లాల్లో ఏర్పడిన అసమానతలను తొలగిస్తూ క్యాడర్ స్ట్రెంథ్‌ను సరిచేయాలని తెలిపారు. మెడికల్, వితంతు ప్రాధాన్యతను గుర్తించాలని పేర్కొన్నారు. ఈ కేటాయింపులు జరిపేందుకు అవసరమైతే సూపర్ న్యూమరరీ పోస్టులను మంజూరు చేయాలని కోరారు. మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు స్పందిస్తూ త్వరలోనే ఈ అంశాలను కచ్చితంగా ప్రతిపాదనల రూపంలో ప్రభుత్వానికి సమర్పించి తగు ఉత్తర్వులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు.

భారీ వర్షాలు... రైల్వే లైన్లు జాగ్రత్త

- ద.మ.రైల్వే జిఎం అరుణ్ కుమార్ జైన్

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

భారీ వర్షాలు కురుస్తున్నందున రైల్వే లైన్లను ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ అన్నారు. సికింద్రాబాద్ రైలు నిలయంలోని సోమవారం జరిగిన 'ఎంప్లాయ్ ఆఫ్ ది మంత్' అవార్డుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎనమిది మంది ఉద్యోగులకు అవార్డులు అందచేశారు. అవార్డులు ఉద్యోగుల్లో గుర్తింపును, విధుల్లో అంకితభావాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. రైల్వే ట్రాక్‌లపై నిరంతర గస్తీ నిర్వహించాలనీ, ఆర్వోబీలు, ఆర్‌యూబీలు, నీటికుంటల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. జోన్ మొత్తంగా నెలరోజులపాటు ప్రత్యేక సేఫ్టీ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నామన్నారు. రైళ్ల సమయపాలనను కచ్చితంగా పాటించాలనీ, దానికోసం సాధ్యమైన మేరకు వేగ పరిమితులను ఎత్తివేయాలని చెప్పారు.

ప్రాథమిక విద్య నిర్వీర్యం

- మూడో తరగతి వరకు అంగన్‌వాడీలకు ఇవ్వొద్దు : డిటిఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఒకటి నుంచి మూడో తరగతి వరకు ప్లేస్కూళ్ల తరహాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యాబోధన ఉంటుందన్న ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదని డిటిఎఫ్ తెలిపింది. దానివల్ల ప్రాథమిక విద్య మొత్తంగా నిర్వీర్యమయ్యే పరిస్థితులు నెలకొంటాయని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎం సోమయ్య, ప్రధాన కార్యదర్శి టి లింగారెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీలకు మూడో తరగతి వరకు విద్యాబోధన ఇవ్వడం వల్ల ప్రాథమిక విద్య ప్రయివేటుపరమయ్యే అవకాశాలుంటాయని పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో అంగన్‌వాడీలను కలపాలని సూచించారు. ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్యను ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించి ప్రభుత్వ విద్యారంగం బలోపేతానికి చర్యలు చేపట్టాలని కోరారు.

సమస్యలపై గళమెత్తిన ఆశాలు

- రూ.18 వేలు వేతనమివ్వాలి
- పరీక్ష పెట్టాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి
- హామీలు అమలు చేయాలంటూ కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు
- లేదంటే 30న చలో అసెంబ్లీ ముట్టడి చేపడతామని హెచ్చరిక

ధర్నా చేస్తున్న ఆశాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"ఆశా వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలి.. పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి.. రిటైర్మెంట్ బెన్‌పిట్స్ ఇవ్వాలి.. ఆశాలకు పరీక్ష పెట్టాలన్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి" అని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర అధ్యక్షులు జయలక్ష్మి డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆశాలు కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో పొందుపర్చిన హామీలు, ఫిబ్రవరి 9న ఆరోగ్య శాఖ కమిషనర్ ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని కోరారు.

మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ఆశాల ధర్నాలో జయలక్ష్మి మాట్లాడారు. గతంలో ఆశాలు 15రోజులపాటు సమ్మె చేసినప్పుడు సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో ఆశాల సమస్యపై చర్చించి నిర్ణయం తీసుకోవాలన్నారు. లేకుంటే ఈ నెల 30న చలో అసెంబ్లీ ముట్టడి కార్యక్రమాన్ని చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో ర్యాలీగా వెళ్లి మున్సిపల్ పార్క్ దగ్గర ఆశాలు ధర్నా చేశారు. జోగులాంబ గద్వాల జిల్లాలోని కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రం ఇచ్చారు. నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్‌ను ముట్టడించారు. అనంతరం ఏవోకు వినతిపత్రం ఇచ్చారు.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టరేట్ల ఎదుట ధర్నాలు చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. మహబూబాబాద్, హనుమకొండ, ములుగు జిల్లా కలెక్టరేట్ల ఎదుట ధర్నా చేశారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని సిద్దిపేట, సంగారెడ్డిలో ఆశాలు ధర్నాలు చేశారు.

ఆదిలాబాద్‌లో ఆశాలు సిఐటియు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. మంచిర్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా, అనంతరం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. ఆసిఫాబాద్‌లో ఆర్డీఓకు వినతి పత్రం అందజేశారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ చౌరస్తా నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ప్రతినిధి బృందం ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చింది. అనంతరం ఆశా వర్కర్ల వద్దకు డిఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుజాత వచ్చి మాట్లాడుతూ.. తమ పరిధిలో గల ఆశా వర్కర్ల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సిరిసిల్ల కలెక్టరేట్ వద్ద ఆశా కార్యకర్తల ధర్నాలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్ మాట్లాడారు. అనంతరం అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. జగిత్యాల కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం కలెక్టరేట్ ఏఓకు వినతిపత్రం ఇచ్చారు.

నల్లగొండ కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, డీఎంఅండ్‌హెచ్ఓకు వినతిపత్రం అందజేశారు. మునుగోడు మండల కేంద్రంలో మండల వైద్యాధికారికి వినతిపత్రం ఇచ్చారు. భువనగిరి యాదాద్రి కలెక్టరేట్ ఎదుట ధర్నా అనంతరం అదనపు కలెక్టర్ వెన్‌శాలోంకు వినతిపత్రం అందజేశారు. సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు.

కావడి యాత్రతో ప్రజల మధ్య బిజెపి చిచ్చు

- యాత్రను సుప్రీం కోర్టు నిలిపివేత అభినందనీయం : ఆవాజ్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కావడి (కన్వర్) యాత్ర సందర్భంగా నిబంధనలు పేరుతో బిజెపి పాలిత ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్య ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన కుల, మత వివక్ష, విద్వేష, విష బీజాలు నాటే ఆదేశాలను సుప్రీంకోర్టు నిలిపివేయడాన్ని ఆవాజ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ స్వాగతిస్తున్నదని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండి అబ్బాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజల మధ్య రాజకీయ ప్రయోజనాల కోసం విభజన చిచ్చు పెట్టే బిజెపి విధానాలను ప్రజలు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. దశాబ్దాలుగా గంగా నది తీరంలో కావడి (కన్వర్) యాత్ర జరుగుతోందని గుర్తు చేశారు. ఆ యాత్రను తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవాలని చూస్తోందని పేర్కొన్నారు. తినుబండారాలు అమ్మే అన్ని దుకాణాల ముందు యజమానులు, పనిచేసే వారి పేర్లతో బోర్డులు పెట్టాలనే ఆదేశాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేశాయని తెలిపారు.దీని వల్ల కలిసి మెలిసి జీవిస్తున్న ప్రజలను మతాల పేరుతో, కులాల పేరుతో విడదీసే కుట్రకు పాల్పడిందని విమర్శించారు. దశాబ్దాల నుంచి అన్ని మతాలకు చెందిన ప్రజలు యాత్రలో పాల్గొంటున్న వారికి సహాయ, సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. కానీ.. ఈ సారి మత, కుల వైషమ్యాలను పెంచి రాజకీయ లబ్దిపొందేందుకు చేస్తున్న కుట్రను సుప్రీం కోర్టు అడ్డుకోవటం హర్షనీయమని తెలిపారు. దేశంలో మతోన్మాద రాజకీయాలని ప్రజలు తిరస్కరిస్తున్నప్పటికీ బిజెపి పదేపదే అదే ప్రయత్నాలు చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు.

పంచాయతీరాజ్ శాఖకు రూ.24 వేల కోట్లు?

- పింఛన్ల పెంపునకు ఆమోద ముద్ర!
- ఈ బడ్జెట్‌లోనే కేటాయింపులు చేసే అవకాశం
- మహిళలకు ఆర్థిక సహాయంపై సిద్ధం కాని ప్రతిపాదనలు!

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర బడ్జెట్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ఈసారి రూ.24వేల కోట్ల రూపాయలు కేటాయించబోతున్నట్టు తెలిసింది. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలున్న నేపథ్యంలో సత్వరం లబ్ది చేకూర్చే పనులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వబోతున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అందులో భాగంగానే పింఛన్ల పెంపునకు ఈ బడ్జెట్‌లో ఆమోద ముద్ర వేసినట్టు తెలిసింది. రాష్ట్రంలో ఇప్పటికే 44 లక్షల మంది లబ్దిదారులున్నారు. కొత్తగా లక్షకుపైగా లబ్దిదారులు చేరే అవకాశముంది. ఇప్పటివరకు ఏటా పింఛన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం వెయ్యి కోట్ల రూపాయలను ఖర్చు చేస్తున్నది. ప్రతి లబ్దిదారునికి రూ.రెండు వేలను అందజేస్తుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో దాన్ని నాలుగు వేలకు పెంచుతామని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ మేరకు లబ్దిదారులకు పింఛన్లు ఇవ్వాలంటే రాష్ట్ర ప్రభుత్వంపై అదనంగా మరో వెయ్యి కోట్ల రూపాయల భారం పడే అవకాశముంది. పంచాయతీ ఎన్నికలున్న నేపథ్యంలో పింఛన్ల పెంపు ప్రకటనను ఈ బడ్జెట్‌లోనే చేస్తారని ప్రచారం జరుగుతున్నది. అందుకోసం ఇప్పటికే బడ్జెట్ ప్రతిపాదనల్లో వాటికి నిధులూ కేటాయించినట్టు తెలిసింది. మహిళలకు రూ.2,500 ఆర్థిక సహాయంపై మాత్రం ఇప్పటివరకూ గైడ్‌లైన్స్ ఖరారు కాలేదు. దీంతో ప్రస్తుత బడ్జెట్‌లో దీనికి సంబంధించి ప్రతిపాదనలు లేనట్టేనని తెలుస్తున్నది. అన్ని పథకాలకూ కీలకంగా మారిన రేషన్‌కార్డుల జారీపైనా ఈ బడ్జెట్ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రకటన చేయబోతున్నట్టు విశ్వసనీయ సమాచారం. సర్పంచులకు సంబంధించిన పెండింగ్ బిల్లుల మంజూరుపైనా తీపికబురు అందించబోతున్నట్టు తెలిసింది. ఇప్పటికే మూడు దశల్లో రూ. రెండు లక్షల వరకు రైతు రుణమాఫీ చేసే కార్యక్రమం మొదలుకావటం వంటి అంశాలను పరిశీలిస్తే పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర సర్కారు ముందుకెళ్తున్నట్టు కనిపిస్తున్నది.

వైకల్యం శరీరానికే.. ప్రతిభకు కాదు

- ఐఎఎస్ స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి
- వికలాంగులకు క్షమాపణ చెప్పే వరకు ఉద్యమం
- ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, అడివయ్య
- ఆర్‌టిసి క్రాస్ రోడ్‌లో నిరసన

నిరసన తెలుపుతున్న వికలాంగులు, నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"అంగవైకల్యం శరీరానికే తప్ప ప్రతిభకు కాదు.. వికలాంగుల రిజర్వేషన్లు రద్దు చేయాలన్న ఐఎఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోవాలి.. వికలాంగులకు ఆమె క్షమాపణ చెప్పాలి.." అని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె వెంకట్, ఎం అడివయ్య అన్నారు. వికలాంగులకు రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లను రద్దు చేయాలనే హక్కు స్మితా సబర్వాల్‌కు ఎక్కడిదని, వికలాంగులను కించపరిచే విధంగా ట్విట్టర్లో పోస్ట్ పెట్టిన ఆమెపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై సోమవారం హైదరాబాద్ ఆర్‌టిసి క్రాస్ రోడ్స్‌లో వికలాంగుల హక్కుల జాతీయ వేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ.. సీనియర్ ఐఎఎస్ అధికారినిగా ఉన్న సబర్వాల్.. కేంద్ర ప్రభుత్వ సర్వీస్‌లలో వికలాంగులకు రిజర్వేషన్స్ అవసరం లేదనడం ఆమె అహంకారానికి నిదర్శనమన్నారు. కేంద్ర ప్రభుత్వ సర్వీస్ ఉద్యోగ నియామకాల్లో వికలాంగుల రిజర్వేషన్ అమలు చేయాలని కోర్టు తీర్పులు ఉన్నాయనే విషయం తెలియకుండా ఐఎఎస్ ఎలా అయ్యారని ప్రశ్నించారు. వికలాంగుల మనోభావాలు దెబ్బతినెలా ప్రవర్తించిన స్మితా సబర్వాల్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి అడివయ్య మాట్లాడుతూ.. ప్రతిభ ఎవ్వరి సొత్తూ కాదని.. అంగవైకల్యం కలిగిన అనేక మంది సమాజంలో అద్భుతాలు సృష్టిస్తున్న విషయం గుర్తించుకోవాలని అన్నారు. వికలాంగుల హక్కుల చట్టం మార్గదర్శక సూత్రాలైన సమానత్వం, వివక్షకు వ్యతిరేకంగా స్మితా సబర్వాల్ ట్విట్టర్‌లో పేర్కొన్నారన్నారు. ముంబయికి చెందిన ఆంకాలజిస్ట్ డాక్టర్ సురేష్ అద్వానీ వికలాంగుడైనా వృత్తిలో విజయం సాధించిన విషయం గుర్తించాలన్నారు. లూయిస్ బ్రేయిలీ, స్టీఫెన్ హాకింగ్, హెలెన్ కెల్లర్ వికలాంగులైనప్పటికీ సమాజం కోసం ఎంతో కృషి చేశారని తెలిపారు. హిరసింఘాల్ అంగవైకల్యం ఉన్నా ఐఎఎస్ టాపర్‌గా నిలిచారన్నారు. వికలాంగుల ప్రతిభ గురించి ఎసి రూములో కూర్చునే స్మితా సబర్వాల్‌కు ఏమి తెలుసన్నారు. వికలాంగులు ఐఎఎస్ అయితే ఫీల్డ్ వర్క్ చేయలేరనడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. వికలాంగులను కించపరిచే విధంగా మాట్లాడిన ఆమెపై 2016 ఆర్‌పిడబ్ల్యుడి చట్టం ప్రకారం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సిఎం, సిఎస్ స్పందించి ఆమెపై చర్య తీసుకోవాలని, పోలీస్ ఉన్నతాధికారులు సుమోటగా కేసు నమోదు చేయాలని కోరారు. కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21కి భిన్నంగా స్మితా సబర్వాల్ వ్యాఖ్యలున్నాయని అన్నారు. వికలాంగులు ఒంటరి కాదని, వారి జోలికి వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి మమత మాట్లాడుతూ.. వికలాంగులను అవమానించిన స్మితా సబర్వాల్ ఐఎఎస్‌గా కొనసాగడం దురదృష్టకరమన్నారు. వికలాంగులకు సామర్థ్యం తక్కువగా ఉంటుందని చెప్పడం ఆమె అవివేకానికి నిదర్శనం అని అన్నారు. స్మిత సబర్వాల్ మానసిక పరిస్థితిపై అనుమానం కలుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, ఎఐకెఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.శోభన్ నాయక్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు రమేష్, ఎన్‌పిఆర్‌డి హైదరాబాద్ సౌత్ జిల్లా అధ్యక్షులు జగదీశ్, నాయకులు గంగమ్మ, రాజు, పవన్, నర్సింగ్, శంకర్ గౌడ్, శ్రీను, జాన్, యాకయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సంస్థల్లో ఉద్యోగోన్నతుల్ని సమీక్షించాలి

- సిఎండితో విద్యుత్ ఉద్యోగుల కుల సంఘాలు భేటీ

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ సంస్థల్లో ఉద్యోగోన్నతులను సమీక్షించాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల బిసి, ఒసి, ఎస్‌సి, ఎస్‌టి కులసంఘాలు డిమాండ్ చేశాయి. సోమవారంనాడిక్కడి విద్యుత్‌సౌధలో ఆయా సంఘాల ప్రతినిధులతో టిజిఎస్‌జెన్‌కో, ట్రాన్స్‌కో సిఎండి రోనాల్డ్ రోస్, ఉత్తర, దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థల సిఎండిలు వరుణ్‌రెడ్డి, ముషారఫ్ ఫరూఖీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా విద్యుత్ సంస్థల్లో రెండేళ్లుగా పదోన్నతులు ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆయా సంఘాల నేతలు చెప్పారు. 2014 జూన్ రెండవతేదీ తర్వాత ఇచ్చిన అన్ని పదోన్నతుల్ని సమీక్షించాలని సూచించారు. నష్టపోయిన రిజర్వేషన్, సీనియారిటీ ఉద్యోగులకు న్యాయం చేయాలని కోరారు. సాధారణ పరిపాలన శాఖ, ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చరల్ యూనివర్సిటీ, పోలీస్ శాఖల్లో ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా గతంలోనే ఉద్యోగోన్నతులను సమీక్షించి, నష్టపోయిన బిసి, ఒసి ఉద్యోగులకు ప్రమోషన్లు ఇచ్చారని గుర్తుచేశారు. భారత రాజ్యాంగం కల్పించిన రూల్ ఆఫ్ రిజర్వేషన్‌ను డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జోనల్ ద్వారా సెలెక్ట్ అయిన వారికి వర్తింపచేయాలని ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘాల ప్రతినిధులు కోరారు. ఉద్యోగుల విభజనకు సంబంధించి సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ కేసు ఉన్నందువల్ల చేయలేదనీ, 2022 డిసెంబర్‌లో సుప్రీంకోర్టులో కోర్టు ధిక్కరణ కేసు మూసివేసినందున విద్యుత్ సంస్థల్లో వెంటనే ఉద్యోగోన్నతులను సమీక్షించాలని ఒసి, బిసి సంఘాల ప్రతినిధులు కోరారు. ఉద్యోగుల సీనియారిటీని మెరిట్ ప్రాతిపదికన నిర్ధారించాలనీ, విద్యుత్ సంస్థల్లోని సర్వీస్ రెగ్యులేషన్లు, హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు, తెలంగాణ స్టేట్ అవార్డునెట్ సర్వీస్ రూల్స్ కూడా మెరిట్ ప్రాధిపతికనే సీనియార్టీని నిర్ధారించాలని సూచిస్తున్నాయని తెలిపారు. కొంతకాలంగా వివిధ క్యాడర్లలో సీనియార్టీలను నిర్ధారించని కారణంగా ఒక్క జూనియర్ లైన్‌మెన్ క్యాడర్‌లోనే దాదాపు 3,600 మందికి ఉద్యోగోన్నతులు రావాల్సి ఉందన్నారు. కొన్ని అంశాలపై ప్రభుత్వం నుంచి వివరణ రావల్సి ఉందనీ, అవి రాగానే ఎవరికీ అన్యాయం జరక్కుండా పదోన్నతులు కల్పిస్తామని చెప్పారు. సమావేశంలో ఒసి, బిసి ఉద్యోగుల జెఎసి చైర్మన్ కోడెపాక కుమారస్వామి, కన్వీనర్ ముత్యం వెంకన్న గౌడ్, కో చైర్మెన్ ఆర్ సుధాకర్‌రెడ్డి కో కన్వీనర్ సీ భానుప్రకాష్, సంపత్‌రెడ్డి, ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ జెఎసి చైర్మన్ డి శ్యాం మనోహర్, పి నారాయణ నాయక్, కన్వీనర్ మాతంగి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీ చికిత్సల ధరల సవరణ

- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆరోగ్యశ్రీ చికిత్సల ధరలను రాష్ట్ర ప్రభుత్వం సవరించింది. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టీనా చొంగ్తూ ఉత్తర్వులు జారీ చేశారు. 1,375 చికిత్సలకు సంబంధించిన ధరలను సవరించినట్టు తెలిపారు. మిగిలిన 297 చికిత్సలకు సంబంధించిన ధరల్లో ఎలాంటి మార్పు లేదని స్పష్టం చేశారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలోకి కొత్తగా 163 చికిత్సలను చేరుస్తూ మరో జీవోను జారీ చేశారు. ఆయా చికిత్సలకు నిర్ణయించిన ధరలను సవరించాలని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్‌లోని ఆస్పత్రులు చాలా కాలంగా డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల సేవలను నిలిపివేస్తామని ఆ ఆస్పత్రుల యాజమాన్యాలు హెచ్చరించారు. అయితే వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఇచ్చిన హామీతో సేవలను తిరిగి కొనసాగించాయి. ఈ నేపథ్యంలో సోమవారం మంత్రి కలిసిన సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల యాజమాన్య ప్రతినిధులకు మంత్రిని కలిసి హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణలో త్వరలో ఉప ఎన్నికలు

- పార్టీ మారిన ఎమ్మెల్యేలు అనర్హులవుతారు
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెవి వివేకానంద

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్యేలు డిస్ క్వాలిఫై అవుతారని, త్వరలోనే రాష్ట్రంలో ఉప ఎన్నికలు వస్తాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద అన్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో సాంకేతిక సమస్య పేరుతో నిలిపివేసిన రుణమాఫీని రైతులందరికీ వర్తించేలా చూడాలని కోరుతూ జిల్లా కలెక్టర్ గౌతమ్‌కు వినతిపత్రం అందజేసిన అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు. సాంకేతిక లోపం పేరుతో కొందరికే రుణమాఫీ వర్తింపజేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. రుణమాఫీ జరుగుతుందనుకున్న రైతుల ఆశలు అడియాసలు అయ్యాయన్నారు. రైతుబంధు డబ్బులను రుణమాఫీకి మళ్లించినట్టు ఆరోపించారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు రూ.39 కోట్ల రుణమాఫీ కావాల్సి ఉండగా.. రూ.11 కోట్లు మాత్రమే చెల్లించి ప్రభుత్వం రైతులను మోసం చేసిందన్నారు. ప్రస్తుతం ఎన్నికలు లేవని, ఓట్లతో పని లేకపోవడంతో రైతుబంధును పోస్ట్‌పోన్ చేసిందని విమర్శించారు. ఎలాంటి నియమ నిబంధనలు లేకుండా అర్హులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయాలన్నింటినీ నేటి నుంచి జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఎంగడుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మేడ్చల్ జిల్లా కో-ఆపరేటివ్ బ్యాంక్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, బౌరంపేట్ ప్యాక్స్ చైర్మన్ మిద్దెల బాల్ రెడ్డి, వైస్ చైర్మన్ నల్తూరి కృష్ణ, డైరెక్టర్ మధు, నాయకులు చింతల దేవేందర్ యాదవ్, మహేష్ యాదవ్ ఉన్నారు.

కలెక్టరేట్‌లో ముగ్గురు మహిళల ఆత్మహత్యాయత్నం

- మా భూమి ఇతరులు కబ్జా చేశారంటూ ఆవేదన
- అధికారులు న్యాయం చేయడం లేదని పెట్రోల్ పోసుకునే యత్నం
- భూసమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదులు
- నా భూమిని ఆక్రమించారంటూ మరో రైతూ ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెట్రోల్ పోసుకున్న మహిళలను అడ్డుకుంటున్న పోలీసులు

తమ భూమిని ఇతరులు కబ్జా చేశారని.. అధికారులు పట్టించుకోవడం లేదంటూ ముగ్గురు మహిళలు, ఓ రైతు వేర్వేరుగా సోమవారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్‌లో ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. వంశ పారంపర్యంగా వచ్చిన తమ భూమిని ఇతరులు కబ్జా చేశారని, దీనిపై రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నపటికీ తమకు న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నడిగూడెం మండలం, రామాపురం గ్రామనికి చెందిన ఎస్టీ మహిళ అరుణ తన కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టరేట్‌కు వచ్చారు. ప్రజావాణి కార్యక్రమంలో ఫిర్యాదు చేయడానికి ముందే తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ని ముగ్గురు మహిళలు పోసుకునే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అక్కడున్న పోలీసులు సిబ్బంది గమనించి వారిని అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. తమ తాతల పేరున మొత్తం పదెకరాల భూమి ఉందన్నారు. అందులో రెండెకరాల 50 సెంట్ల భూమికి సర్వేనంబర్ 190/24లో పహనీ ఉండగా.. తమ పక్కనే ఉన్న భూతరాజు రామారావు, భూతరాజు రాజీ తమ భూమిని కబ్జాచేశారని తెలిపారు. నడిగూడెం ఎంఆర్ఒ నరసింహారావు వారికి దొంగ పట్టా చేసి పాస్‌బుక్కు ఇచ్చారని ఆరోపించారు. తాము పొట్టకూటి కోసం ఊరు వదిలి వెళ్లామని, వచ్చేసరికే భూమిని కాజేశారని కన్నీరు మున్నీరయ్యారు.

ఇదిలా ఉండగా, సూర్యాపేట మండలం బాలెంల గ్రామానికి చెందిన రైతు అవుట నాగయ్య కూడా భూసమస్యపై కలెక్టరేట్‌కు వచ్చాడు. తన భూమిని ఓ వ్యక్తి బలవంతంగా లాక్కున్నారని, సర్వే నంబర్ 836లోని రెండెకరాల 11 గంటల భూమిలో బోర్డు పెట్టి తననే రానివ్వడం లేదంటూ.. తన వెంట తెచ్చుకున్న పురుగుల మందు డబ్బాను తీయబోతుండగా పోలీసులు అడ్డుకున్నారు. కబ్జాదారుడు వాహనానికి పోలీస్ స్టిక్కర్ వేసుకొని కొంతమందితో తన భూమి దగ్గరకు వచ్చి కౌలు చేసే వ్యక్తిని తరచూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తమ భూమి తమకు ఇప్పించాలని అధికారులను వేడుకున్నాడు.


ధర్నా చేస్తున్న రైతులు

పట్టా భూమిని లాక్కుంటే మూకుమ్మడి ఆత్మహత్యలే

- పోలీసులు కేసులు పెట్టి భయపెడుతున్నారు
- పురుగుల మందు డబ్బాలతో తహశీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తమ స్వంత పట్టా భూమిని లాక్కుంటే.. మూకుమ్మడి ఆత్మహత్యలు చేసుకుంటామని రామాయంపేటకు చెందిన పలువురు రైతులు నిరసన వ్యక్తం చేశారు. సోమవారం మెదక్ జిల్లా రామాయపేట పట్టణానికి చెందిన అన్నమైన మల్లయ్య, రాజయ్యతో పాటు వారి కుటుంబ సభ్యులు సుమారు 15 మంది వారి పంట పొలం వద్ద పురుగుమందు డబ్బాలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం ముందు పురుగుమందు డబ్బాలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన శీలం వెంకటరెడ్డి, బాల్‌రెడ్డి.. తమ పొలంలోకి రావడానికి దౌర్జన్యం చేస్తున్నారని తెలిపారు. ఈ భూమికి దగ్గరలో ఉన్న తమ ఇతర సొంత భూమిలో నుంచి పైపులైన్లు వేసుకొని 25 ఏండ్లుగా సాగు చేసుకుంటున్నామన్నారు. ఈ విషయమై పోలీసులు అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపుతామని బెదిరించి తమను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. 25 ఏండ్లుగా రిజిస్ట్రేషన్ పత్రాలతో పాటు పట్టా కలిగిన తమను కాదని, ఎలాంటి పత్రాలు లేని వారికి పోలీసులు మద్దతు తెలుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము సాగు చేసుకుంటున్న భూమిని లాక్కోవడానికి ప్రయత్నిస్తే పురుగుల మందు తాగి మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటామని హెచ్చరించారు. దీనిపై ఎస్ఐ రంజిత్ స్పందిస్తూ.. తమ భూమిలో అక్రమంగా చొరబడ్డారని వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఏదైనా ఉంటే కోర్టు ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు.